
సాక్షి ఒడిశా

సోమవారం । 29 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,03,026లు, బంగారం 18గ్రాము 960 మిల్లీగ్రాములు, వెండి 68 గ్రాములు 840 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అమ్మకాలు అదుర్స్

గోపాల్‌పూర్ తీరంలో నాలుగు రోజులుగా జరుగుతున్న సాగర సంబరాల్లో హస్తకళా వస్తువులను జనం పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు.

- 8లో.



ఉత్సాహంగా మినీ మారథాన్

మినీ మారథాన్ కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. అందరికీ విద్య అన్న నినాదం చేస్తూ విద్యార్థులు పాల్గొన్నారు.

- 8లో.

న్యూస్‌రీల్

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



పోటీలో పాల్గొన్న మహిళలు

రాయగడ: ఆరోగ్యవంతమైన జీవితానికి నడక ఎంతగానో మేలు చేస్తుందని, ప్రతిఒక్కరూ వాకింగ్ అలవాటు చేసుకోవాలని చైతన్యపరుస్తూ స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రాయగడ ప్రధాన కూడళ్ల మీదుగా ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు నడక పోటీలు నిర్వహించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఎల్. స్వాతి, స్మిత, రమ్యశ్రీలకు క్లబ్ అధ్యక్షురాలు కొరాడ రజిత బహుమతులు అందజేశారు.

పేదలకు పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాల లబ్ధిదారులతో రెవెన్యూ అధికారులు

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి గొగుపాడు పంచాయతీ కటికి, జర్లింగ్ గ్రామాల్లో నివసిస్తున్న 32 మంది నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామనుగడ తహసీల్దార్ నిర్మల్ చంద్ర సాహు, అదనపు తహసీల్దర్ యాడొంబు రుధర్ బెహరా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వీరికి ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో విలీనం చేసిన అనంతరం ఇళ్ల పట్టాలను మంజూరు చేసినట్లు తెలిపారు. పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహకారం కూడా అందిస్తామని చెప్పారు.

వాటర్ ట్యాంక్‌లో పడి మూడేళ్ల బాలిక మృతి

జయపురం: వాటర్ ట్యాంక్‌లో పడి మూడేళ్ల బాలిక మృతిచెందిన ఘటన జయపురం సమితి కుంతర్‌ఖల్ గ్రామంలో చోటుచేసుకుంది. టుకున హరిజన్ తన ఇంటి వద్ద నీటిని నిల్వ చేసేందుకు ప్లాస్టిక్ ట్యాంకు తీసుకొచ్చాడు. తన మూడేళ్ల కుమార్తె అక్కడ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ట్యాంకులో పడిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడం, నీరు ఎక్కువగా ఉండటంతో ఊపిరాడక మృతిచెందింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు బాలికను బయటకు తీసి హుటాహుటిన జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పాప మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బాలిక తలిదండ్రులకు అప్పగించారు.

ఆరేళ్ల బాలికపై లైంగికదాడి

- నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

జయపురం: ఆరేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి జయపురం స్వతంత్ర పోస్కో కోర్టు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించింది. ఈ మేరకు పోస్కో కోర్టు స్వతంత్ర ప్రభుత్వ న్యాయవాది డాక్టర్ బి.గాయిత్రీదేవి ఆదివారం వివరాలు వెల్లడించారు. 2019 నవంబర్ 6న కొరాపుట్ జిల్లా జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధిలో ఆరేళ్ల బాలిక తమ పొలంలో చేపలు పట్టేందుకు వెళ్లింది. బాలిక ఒంటరిగా ఉండటం గమనించిన అమడాగుడ గ్రామానికి చెందిన డొంబు ముదులి అలియాస్ పొరజ బాలికను సమీపంలో ఉన్న అడవిలోకి ఎత్తుకుపోయాడు. అరిస్తే చంపుతానని బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయడంతో వారు బొరిగుమ్మ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారి సంజయకుమార్ మండల్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి నిందితుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచారు. కేసు విచారణలో పోస్కో కోర్టు 10 మంది సాక్షులను విచారించి డొంబు ముదులిని దోషిగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.30 వేలు జరిమానా విధిస్తూ శనివారం తీర్పునిచ్చింది.

సమాజ శ్రేయస్సుకు కృషిచేయాలి



మాట్లాడుతున్న మంత్రి సరక

రాయగడ : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న పత్రికలు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక పిలుపునిచ్చారు. ఒడియా దినపత్రిక క్రాంతి ధార 28వ వార్షికోత్సవం స్థానిక బిజుపట్నాయక్ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా అదనపు ఎస్పీ విష్ణుప్రసాద్ పాత్రో, క్రాంతిధార దినపత్రిక ఎడిటర్ గోవిందచంద్ర సామల్, జిల్లా ప్రతినిధి సంగ్రామ్ పట్నాయక్, ప్రముఖ కవి సుశాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదపు దారుల్లో..!









చల్లని శీతాకాలంలో నగర వీధుల్లోని చిరు పూదోటలు ఆహ్లాదపరుస్తున్నాయి. భువనేశ్వర్ నగరంలోని ప్రధాన కూడళ్లలో సువిశాల వృత్తాకార ప్రాంగణంలో పూల మొక్కలు కనువిందు చేస్తున్నాయి. ప్రధాన రహదారుల ఇరువైపులా పలు రంగుల మొక్కల్ని స్థానిక నగర పాలక సంస్థ (బీఎంసీ) ఏర్పాటు చేసింది. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వారికి ఈ మొక్కల అమరిక ఆహ్లాదపరుస్తోంది.

– భువనేశ్వర్

అంబరాన్నంటిన సాగర సంబరం



సాగర సంబరాల్లో సందర్శకుల తాకిడి



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ సాహు, విక్రమ్ పండా, సుభాష్ తదితరులు

- గోపాల్‌పూర్ బీచ్ ఫెస్టివల్‌కు పోటెత్తిన పర్యాటకులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ఫ్రెండ్స్ డ్యాన్స్ గ్రూప్ దేశభక్తి ప్రదర్శన

బరంపురం: గోపాల్‌పూర్ తీరం అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందేలా తన వంతు కృషి చేస్తానని గంజాం జిల్లా పులసరా ఎమ్మెల్యే శ్రీకాంత్ సాహు చెప్పారు. ఎమ్మెల్యే విక్రమ్ పండా అధ్యక్షతన జరుగుతున్న గోపాల్‌పూర్ బీచ్ ఫెస్టివల్ నాలుగో రోజు కార్యక్రమాలను ఎమ్మెల్యే శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాల్‌పూర్ తీరానికి వచ్చే పర్యాటకుల కోసం అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. జిల్లాలోని చిలికా, రుశికుల్యా తీరం, తరతరిణి కొండా, నిర్మలాజార్, వేడినీటి తప్తపాణి, కాలువ కొండ, నారాయణ వంటి అనేక పర్యాటక స్థలాలు కనువిందు చేస్తున్నాయని చెప్పారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, స్టార్‌నైట్ షోలు అలరించాయి. కార్యక్రమంలో ఛత్రపూర్ ఎమ్మెల్యే సుబాష్ బెహరా, సరడా ఎమ్మెల్యే పూర్ణ స్వాయిన్ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న బరంపురం కళాకారుల మహిషాసుర మర్దిని నృత్య ప్రదర్శన



స్థానిక కళాకారుల నృత్య గాన ప్రదర్శన



కొంధమాల్ ఆదివాసీల నృత్య ప్రదర్శన

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



వందమీటర్ల పరుగు పోటీల్లో విద్యార్థినులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో 11వ వంశధార వసంతోత్సవాల సందర్భంగా ఆదివారం రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన మషాల్ ర్యాలీలో గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగొ ముఖ్యఅతిథిగా, మున్సిపల్ చైర్‌పర్సన్ మమత గౌడొ, వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడొ, సమితి అధ్యక్షురాలు ఝిల్లి సాబొరొ, ఉపాధ్యక్షులు సురదర్శన్ సాబొరొ, సబ్ కలక్టర్ లలిత్ కుమార్ కుహరో అతిథులుగా హాజర్యారు. గుణుపూర్ దక్షిణ కాళి మందిరం నుంచి ప్రారంభమైన మషాల్ ర్యాలీ మినీ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం స్టేడియంలో క్రీడా జెండాను ఎమ్మెల్యే గొమాంగొ ఆవిష్కరించారు. అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న 15 మంది క్రీడాకారులను సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది వసంతోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఖోఖో, కబడ్డీ, తగ్‌ఆఫ్‌వార్, టెన్నిస్ తదితర క్రీడా పోటీలను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడానిర్వాహక కమిటీ అధ్యక్షుడు అక్షయ్ దాస్, కార్యదర్శి మిలీపాడి, ఎ.బాబా ప్రసాద్, ఉమదాస్, రమేష్ లిమ్మా, రాజేష్ పాడి తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోరులో తలపడుతున్న యువకులు



మషాల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గొమాంగొ, మున్సిపల్ చైర్‌పర్సన్ మమత

రాష్ట్ర బార్ కౌన్సిల్ కమిటీ సభ్యుడిగా రమేష్ పాత్రో



జయపురం: జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు పి.రమేష్ పాత్రో రాష్ట్ర బార్ కౌన్సిల్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. పాత్రోకు నాలుగు ప్రధాన కమిటీల్లో స్థానం కల్పించారు. క్రమశిక్షణ కమిటీ, న్యాయవాదుల సంక్షేమ కమిటీ, గ్రంథాలయ కమిటీ, న్యాయ సేవా కమిటీలలో పాత్రోను నియమించారు. ఈ సందర్భంగా కొరాపుట్ జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు పాత్రోను అభినందించారు.

వణికిస్తున్న చలిగాలులు

భువనేశ్వర్: రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. జి.ఉదయగిరిలో 6.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతనమోదు కావడంతో అత్యంత చలి ప్రాంతంగా మారింది. సుందర్‌గడ్‌లో 7.4, కిరైలో 7.8, ఫుల్బాణిలో 8.5, దారింగ్‌బాడిలో 8.5, అంగుల్‌లో 9.0, కెంజొహర్‌లో 9.0, రౌర్కెలాలో 9.4, ఝార్సుగుడలో 10.0, జంట నగరాలు భువనేశ్వర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 15.1, కటక్‌లో 14.5 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. స్థానిక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం సమాచారం ప్రకారం గత 24 గంటల్లో రాష్ట్రంలో తొమ్మిది చోట్ల రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదైంది. ఝార్సుగుడ, సుందర్‌గడ్, కెంజొహర్, దేవ్‌గడ్, అంగుల్ ప్రాంతాలలో మరో రెండు రోజుల పాటు చలిగాలులు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ సమాచారం. ఆ తర్వాత రాత్రి పూట ఉష్ణోగ్రత 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 3 డిగ్రీలు చొప్పున పెరుగుతాయని ఐఎండీ అంచనా వేసింది. అంగుల్‌తో సహా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. భవానీపట్న, బరిపద, కెంజొహర్ ప్రాంతాల్లో తేలికపాటి పొగమంచు కమ్మింది. చలిగాలుల హెచ్చరికలు లేనప్పటికీ సోమవారం ఉదయం 8.30 గంటల వరకు కలహండి, కంధమల్, రాయగడ, నవరంగపూర్, కొరాపుట్ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల దట్టమైన పొగమంచు కమ్మే అవకాశం ఉంది.

ఆటకు వీడ్కోలు

- అంతర్జాతీయ హాకీకి గుడ్‌బై చెప్పిన మహిళా డిఫెండర్ దీప్ గ్రేస్ ఎక్కా

భువనేశ్వర్ : భారత మహిళా జట్టు హాకీ డిఫెండర్ దీప్ గ్రేస్ ఎక్కా హాకీకి రిటైర్మెంట్ ప్రకటించింది. ఒలింపియన్ అయిన ఈమెకు ఒడిశాతో పాటు దేశవ్యాప్తంగా గొప్ప క్రీడాకారిణిగా పేరుంది. భారత మహిళల సీనియర్ టీమ్‌కు చెందిన ఈ డిఫెండర్ శనివారం అంతర్జాతీయ హాకీ నుంచి విరామం ప్రకటించింది. జాతీయ జట్టు సభ్యురాలిగా దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణాన్ని ముగించింది. దీటైన డిఫెండర్, పెనాల్టీ కార్నర్ నిపుణురాలైన ఎక్కా స్వగ్రామం సుందర్‌గడ్ జిల్లా లుల్కిడిహి. 29 ఏళ్ల ఈ క్రీడాకారిణి దేశం తరఫున 24 గోల్స్ చేసి 268 విజయాల్ని చేకూర్చింది.

- 17 ఏళ్ల చిరు ప్రాయంలో 2011లోనే జాతీయ జట్టులో స్థానం సంపాదించింది. అర్జెంటీనాలో జరిగిన 4 దేశాల టోర్నమెంట్‌లో అరంగేట్రం చేసింది.
- థాయిలాండ్ బ్యాంకాక్‌లో జరిగిన అండర్–18 బాలికల ఆసియా కప్ పోటీలో విశేష ప్రతిభ కనబరిచింది. జర్మనీలో జరిగిన 2013 మహిళల జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో భారత జూనియర్ జట్టు క్రీడాకారిణిగా, చరిత్రాత్మకమైన కాంస్య పతకాన్ని గెలుచుకుని కీర్తి చరిత్ర పుటల్లో చోటు చేసుకుంది.
- 2013లో మహిళల ఆసియా కప్‌లో సీనియర్ జట్టుతో కాంస్యం, అదే ఏడాది జరిగిన ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో రజత పతకాన్ని గెలుచుకున్న ఆమె అదే ఏడాది జూనియర్, సీనియర్ స్క్వాడ్‌లకు రెట్టింపు విజయాలు జోడించింది.



దీప్ గ్రేస్ ఎక్కా

- మొదటి సారి రియో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన జట్టులో దీప్ గ్రేస్ ఎక్కా కీలక పాత్ర పోషించింది. రాష్ట్రంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా – ఎస్ఏజీ సెంటర్ నుంచి తన రాష్ట్రానికి చెందిన అనేక మంది యువ ఆటగాళ్లకు గొప్ప ప్రేరణగా నిలిచింది.

క్లుప్తంగా

పోలమాంబ దర్శనానికి బారులు తీరిన భక్తులు





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, (ఇన్‌సెట్లో) పూజలందుకుంటున్న పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచి భక్తులు గ్రామానికి చేరుకుని, చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వనం గుడిలో ఉన్న పోలమాంబ మేనత్త, పెదపోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. వనంగుడి వెనుకన ఉన్న వేప చెట్టుకు పూజలు చేశారు. అమ్మ దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవదాయశాఖ సిబ్బంది మురళి తదితరులు చర్యలు చేపట్టారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో సత్తా





హారిక(తృతీయ స్థానం) వి.రాము(మొదటిస్థానం)

నెల్లిమర్ల రూరల్: ఈ నెల 19 నుంచి తమిళనాడులో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ క్రీడాకారులు సత్తా చాటారు. గ్రామానికి చెందిన వి.రాము 89 కేజీల విభాగంలో ఆదివారం పోటీలో పాల్గొని స్నాచ్ 126 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 166 కిలోలు, మొత్తంగా..292 కేజీల బరువును ఎత్తి మొదటి స్థానం కైవసం చేసుకున్నాడు. అలాగే మరో క్రీడాకారిణి బెల్లాన హారిక 59 కేజీల విభాగంలో పాల్గొని స్నాచ్ 73 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 93 కిలోలు, మొత్తంగా 166 కిలోల బరువు ఎత్తి తృతీయస్థానంలో నిలిచింది. పతకాలు సాధించిన వెయిట్ లిఫ్టర్లకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

సత్తా చాటిన వస్తాదులు

- ఆకట్టుకున్న సంగిడి రాళ్ల పోటీలు



సత్తా చాటిన వస్తాద్ వెంకటేష్

వేపాడ: వేపాడ గ్రామదేవతల తీర్థం సందర్భంగా నిర్వహించిన సంగిడి రాళ్ల పోటీల్లో విజయనగరం, విశాఖ అనకాపల్లి జిల్లాలకు చెందిన వస్తాదులు పాల్గొన్నారు. గోపాలకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు రూ.6వేలు, రూ.నాలుగువేలు, రూ.రెండువేల ఐదువందలు నగదు బహుమతులను అందజేశారు. విసురు, పోటు, తీత విభాగాల్లో విజయనగరం జిల్లా అంబటివలసకు చెందిన పి.వెంకటేష్ ప్రథమస్థానంలో నిలిచాడు. అలాగే రామచంద్రపేటకు చెందిన బి.గోవింద పోటు, తీత, విసురు విభాగాల్లో ద్వితీయస్థానం సాధించాడు. రామచంద్రంపేటకు పి.శ్రీను విసురులో మూడోస్థానంలో నిలిచాడు. గరుడబిల్లికి చెందిన ఎస్.శ్రీను పోటు, తీతలో తృతీయస్థానం సాధించాడు. ఈ పోటీల్లో వస్తాదులు 30 కేజీల రాయినుంచి 130 కేజీల బరువున్న సంగిడి రాళ్లను ఎత్తి సత్తా చాటారు.

రామతీర్థం సేవాసంఘం సేవలు ప్రశంసనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

నెల్లిమర్ల రూరల్/విజయనగరం ఫూల్‌బాగ్: రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానం అభివృద్ధే లక్ష్యంగా రామతీర్థం సేవా సంఘం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ఈ మేరకు విజయనగరం పట్టణంలో రామతీర్థం సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ సేవా సంఘం తరపున రామతీర్థం పరిసర ప్రాంతాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఉత్సవ సమయాల్లో విశేష సేవలు అందిస్తున్నారని కితాబిచ్చారు. సభ్యుల ఆమోదం మేరకు పాత కార్యవర్గాన్నే కొనసాగిస్తున్నట్లు సేవా సంఘం సభ్యులు తెలిపారు. అనంతరం అయోధ్య బాల రాముని ప్రాణప్రతిష్ట సందర్భంగా నెల్లిమర్ల నుంచి రామతీర్థం వరకు జరిగిన శోభాయాత్రకు ఆర్థిక సహకారం అందించిన బడాన రాజశేఖర్‌ను సత్కరించారు.

అమ్మకాలు అదుర్స్



ఆకట్టుకుంటున్న హస్తకళా వస్తువుల/

గోపాల్‌పూర్ తీరంలో నాలుగు రోజులుగా జరుగుతున్న సాగర సంబరాల్లో పల్లేశ్రీ మేలాకు జనం పోటెత్తుతున్నారు. దక్షిణ ఒడిశాకు చెందిన రాయగడ, కొంధమాల్, గజపతి, నవరంగపూర్, బౌద్ జిల్లాల్లోని ఎస్ఎస్‌జీ మహిళలు తయారు చేసిన హస్తకళా పనిముట్లు పెద్ద ఎత్తున అమ్ముడుపోతున్నాయి. పచ్చళ్లు, కందిగుండ పౌడర్లు, అప్పడాలు వంటి సరుకులను సందర్శకులు కొనుగోలు చేస్తున్నారు. - బరంపురం



చిన్నారుల ఆటబొమ్మలు



వివిధ రకాల వృక్షాలు



హస్త కళావస్తువులు



హస్తకళల స్టాల్స్

నోట్ల మార్పిడి కేసులో ఇద్దరి అరెస్టు

పర్లాకిమిడి: రెండు వేల రూపాయల నోట్లు నగదు మార్పిడి వ్యవహారంలో రూ.30 లక్షలు పోగొట్టుకున్న విశాఖపట్నానికి చెందిన టి.నాగ రవీంద్రనాథ్ కేసును పర్లాకిమిడి పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి 19న విశాఖపట్నం మురళీనగర్‌కు చెందిన టి.నాగరవీంద్రనాథ్ నెల్లూరులో తన పూర్వీకుల ఆస్తులు అమ్మగా వచ్చిన రూ.2000 నోట్ల కరెన్సీ మొత్తం రూ.30 లక్షలను కమీషన్ పద్ధతిలో మార్పిడి చేసేందుకు పర్లాకిమిడి రాధాగోవిందనగర్‌కు చెందిన తనూజ్‌కుమార్ సాబత్, ఆంధ్రప్రదేశ్‌లోని సాలూరు మండలం మారిపిల్లి గ్రామానికి చెందిన వినోద్ రాయపిల్లి అలియాస్ రాజేష్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనిలో భాగంగా నాగరవీంద్రనాథ్ తరపున శ్రీనివాస్, భాస్కర్, కె.వై.రత్నంలు జనవరి 25న నగదు పట్టుకుని కారులో విశాఖ నుంచి బయలుదేరి పర్లాకిమిడి వచ్చారు. వీరిని కలిసిన వినోద్.. పర్లాకిమిడి కొత్త బస్టాండులో తనబాస్ ఉన్నాడని, ఓ ప్రైవేటు రెసిడెన్సీలో వెయిట్ చేయాలని చెప్పి అదును చూసుకుని వారి వద్ద ఉన్న క్యాష్ బ్యాగ్‌ను పట్టుకుని ఉడాయించాడు. శ్రీనివాస్, కె.వై.రత్నం కేకలు వేయడంతో అక్కడ వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు వినోద్‌ను పట్టుకుని బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శ్రీనివాస్, రత్నం పర్లాకిమిడి ఆదర్శ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు వినోద్, తనూజ్‌కుమార్ సాబత్‌లను అరెస్టు చేశారు. తనూజ్‌కుమార్ సాబత్ పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్టు సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఐదు మొబైళ్లు, రూ.30 లక్షల కరెన్సీని స్వాధీనం చేసుకుని జిల్లా కోర్టుకు తరలించినట్టు ఎస్.డి.పి.ఓ. మాధవానంద నాయక్ తెలిపారు.





తనూజ్ కుమార్‌సాబత్ రాయిపల్లి వినోద్

మల్కన్‌గిరి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పద్మినీ కన్నుమూత



పద్మినీ ముదిలి (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ పద్మినీ ముదిలి (66) ఆదివారం గుండెపోటుతో కన్నుమూశారు. శనివారం రాత్రి వరకు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపిన పద్మినీ అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఛాతిలో నొప్పిగా ఉందంటూ ఇబ్బందిపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరిచారు. ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న జిల్లా వాసులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బీజేడీ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించిన పద్మినీ సర్పంచ్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. పద్మినీకి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు శ్రీనివాస్ ముదిలి బీజేడీలో ఉంటూ ప్రస్తుతం ఖోయిర్‌పూట్ సమితి చైర్మన్‌గా ఉన్నారు. పద్మినీ భర్త నీలకంఠ ముదిలి మూడు నెలల కిందటే మృతి చెందారు. ఆదివారం సాయంత్రం పద్మిని అంత్యక్రియలు నిర్వహించారు. ఈమె మృతి పట్ల చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మానాస్ మడ్కమి, చిత్రకొండ మాజీ ఎమ్మెల్యే డోంబురు సీస, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే ముకుందో సోడి, మాజీ పరపాలిక అధ్యక్షురాలు రజ్బత్‌కోర్ సంతాపం తెలియజేశారు.



పద్మినీ ముదిలి భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క

ఫలించిన ‘సేవా’ కార్మికుల పోరాటం



సేవాపేపరు మిల్లు కార్మికులు

జయపురం: గగణాపూర్ సేవా పేపరుమిల్లు కార్మికుల నాలుగేళ్ల పోరాటం ఫలించింది. బిల్ట్ గ్రాఫిక్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ సేవా పేపరుమిల్లులో పనిచేసిన కార్మికుల పీఎఫ్‌ను కరమ్‌చంద్ థాపర్ పి.ఎఫ్. ట్రస్టు కోల్‌కతా నుంచి బరంపురంలోని రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. 1222 మంది కార్మికులకు సంబంధించి రూ.22 కోట్లు బరంపురం ట్రాన్స్‌ఫర్ కావటంతో కార్మికుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇందుకు కృషి చేస్తున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్కకు ప్రథమ కార్మిక యూనియన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ మహంతి, కార్యదర్శి ప్రదీప్ పంజియ, సెకెండ్ యూనియన్ అధ్యక్షుడు బంశీధర మహంకుడొ, కార్యదర్శి సరోజ్ సువార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉత్సాహంగా మినీ మారథాన్

రాయగడ: కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ (కిస్) ఆధ్వర్యంలో స్థానిక మహర్షి విద్యామందిరం నుంచి వివేకానంద విద్యాలయం వరకు అందరికీ విద్య అనే నినాదంతో ఆదివారం మినీ మారథాన్ నిర్వహించారు. సంస్థ రాయగడ కన్వీనర్ అమూల్య రత్న సాహు నేతృత్వంలో జరిగిన ఈ మారథాన్‌లో అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర రైతా, అదనపు ఎస్పీ విష్ణు పాత్రో, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి తదితరులు పాల్గొని ర్యాలీ ప్రారంభించారు. అనంతరం వివేకానంద విద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో కన్వీనర్ సాహు ప్రసంగిస్తూ కిస్ సంస్థ ఎంతోమంది ఆదివాసీ పేద విద్యార్థులకు ఉచితంగా వసతి సౌకర్యం కల్పిస్తూ విద్యనందిస్తున్నట్లు చెప్పారు.

మల్కన్‌గిరి: కీట్–కీస్ ఆధ్వర్యంలో మల్కన్‌గిరిలో ఆదివారం ఉదయం మినీ మారథాన్ నిర్వహించారు. టీమ్ ఇండియా క్రికెట్ మేనేజర్ సత్‌భర్ సింగ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్టేడియం నుంచి మాల్యావంత్ హాస్టల్ వరకు మారథాన్ కొనసాగింది. మల్కన్‌గిరి అటవీశాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి, జిల్లా వెల్ఫేర్ అధికారి ప్రముల్లకుమార్ భుజబాల్, ఎక్సైజ్ అధికారి జగన్నాథ్ భీసోయి తదితరులు పాల్గొన్నారు.



రాయగడ:మినీ మారథాన్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్, ఎస్పీ



మల్కన్‌గిరి: మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

‘బంగారు’ కుటుంబం



బంగారు పతకాలు సాధించిన కుటుంబ సభ్యులు

- వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఐదుగురికి స్వర్ణ పతకాలు

జయపురం: భువనేశ్వర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు బంగారు పతకాలు సాధించారు. ఒడిశాతో పాటు 7 రాష్ట్రాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో జయపురానికి చెందిన విశ్వనాథ్ నాయిక్ మాస్టర్ గ్రూపులో స్వర్ణం, కుమారుడు వివేక్ జూనియర్ 93 కేజీల విభాగంలో స్వర్ణం, కుమార్తె వైభవి యూత్ విభాగంలో స్వర్ణం, సోదరుడు రవీంద్ర నాయిక్ మాస్టర్ గ్రూపులో స్వర్ణం, అతని కుమారుడు రాధామోహన నాయిక్ 83 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. వీరిని జిల్లా క్రీడాకారులు, ప్రముఖులు అభినందిస్తున్నారు.

జయపురం పట్టణ పోలీసు అధికారిగా రమణీరంజన్



రమణీరంజన్ దొలాయ్

జయపురం: పట్టణ పోలీసు అధికారిగా రమణీ రంజన్ దొలాయి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన సత్యానంద పాత్రోను సునామెడ పోలీసు అధికారిగా బదిలీ అయ్యారు. అక్కడి నుంచి రమణీ రంజన్ జయపురానికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన రమణీరంజన్ ఆదివారం పట్టణంలక్ష పర్యటించి పరిస్థితులపై ఆరా తీశారు. ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న పుష్పుని ఉత్సవాలను తిలకించారు.

న్యాయవాది గాయిత్రీదేవికి సన్మానం



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న గాయిత్రీదేవి

జయపురం: ప్రభుత్వ స్వతంత్ర న్యాయవాదిగా అనేక పోస్కో కేసుల్లో దోషులకు శిక్షలు పడేలా వాదించిన లాయర్ డాక్టర్ గాయిత్రీ దేవిని కొరాపుట్‌లో పోలీసు యంత్రాంగం ఘనంగా సన్మానించారు. కొరాపుట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్పీ అభినవ సోనకార్ గాయిత్రీదేవికి ప్రశంసాపత్రం అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బిమళ కాంత బ్రహ్మ, ప్రొబిషనల్ అడిషనల్ ఎస్పీ బలబద్ర దీప్ తదితరులు పాల్గొన్నారు.

విక్రమదేవ్ వర్సిటీ క్యాంటీన్ ప్రారంభం

జయపురం: జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో నిర్మించిన విద్యార్థుల క్యాంటీన్‌ను జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నిధులతో దీనిని నిర్మించారు. అనంతరం ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్మించిన కామన్ రూమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఓఎస్‌డీ డాక్టర్ దేవీప్రసాద్ మిశ్రా, రిజిస్ట్రార్ డాక్టర్ గోపాల హలదార్, పి.జి.కౌన్సిల్ చీఫ్ డాక్టర్ కిచెక్ చంద్ర జెనా, అధ్యాపకులు లక్ష్మణ పాత్రో, కళాశాల ప్రిన్సిపాల్ వివేకానంద సున తదితరులు పాల్గొన్నారు.



క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, అధికారులు, విద్యార్థులు

పంటలు ధ్వంసం చేసిన ఏనుగులు

కురుపాం: మండలంలోని కిచ్చాడ గ్రామ పరిసరాల్లో శనివారం సాయంత్రం ప్రవేశించిన ఏనుగుల గుంపు ఇంకా గ్రామ పరిసరాల్లోనే తిష్ఠవేసినట్లు సర్పంచ్ గవర రాజేశ్వరి తెలిపారు ఆదివారం పంచాయతీ పరిధిలోని పామాయిల్, మొక్కజొన్న, అరటి తోటలను ధ్వంసం చేశాయని గ్రామానికి చెందిన రైతులు ఉమామహేశ్వరరావు, అప్పలనాయుడు, నిర్మలతోపాటు ఇతర రైతులు వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని సర్పంచ్, బాధిత రైతులు కోరారు.



కిచ్చాడ పరిసరాల్లో అరటి తోటల్లోకి వెళ్తున్న ఏనుగుల గుంపు

న్యూస్‌రీల్

ఎలుగు బంటి హల్‌చల్



గ్రామం మధ్యలో తిరుగుతున్న ఎలుగుబంటి

టెక్కలి రూరల్: సంబొమ్మాళి మండలం శివరాంపురం గ్రామం పరిధిలో శనివారం అర్ధరాత్రి సమయంలో ఒక ఎలుగు బంటి హల్‌చల్ చేసింది. ఊరి మధ్యలో ఎలుగు పరుగులు తీయడంతో కుక్కలు అరుస్తూ వెంబడించాయి. కొందరు స్థానికులు వచ్చి చూడగా భల్లూకం కనిపించింది. గ్రామస్తులంతా కలసి ఆ ఎలుగు బంటిని గ్రామం నుండి వెల్లగొట్టారు.

పోలీస్ జట్టు విజయం



విజేత పోలీస్ జట్టుకు ట్రోఫీ ప్రదానం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా పోలీస్, రెవెన్యూ శాఖల క్రికెట్ జట్లు చిలకపాలేంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ మైదానంలో ఆదివారం టీ20 మ్యాచ్ ఆడాయి. ఉద్యోగాల్లో నిత్యం ఒత్తిడిగా ఉండే వీరు ఉల్లాసంగా క్రికెట్ మ్యాచ్ ఆడారు. మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు 204 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన రెవెన్యూ జట్టు 177 పరుగులకు ఆలౌటైంది. విజేత జట్టుకు ట్రైనీ ఐఏఎస్ రాఘవేంద్రమీనా, అదనపు ఎస్పీ తిప్పేస్వామి, శివానీ మేనేజ్ మెంట్ సభ్యులు పి.దుర్గాప్రసాద్ రాజు ట్రోఫీ అందజేశారు.

జూట్ యూనిట్ సందర్శన



కాశీబుగ్గలో జూట్ యూనిట్ పరిశీలిస్తున్న పీడీ కిరణ్‌కుమార్, కమిషనర్ నాగేంద్రకుమార్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మెప్మా విభాగంలో ఉన్న శ్రీగాయత్రి ఎస్ఎల్ఎఫ్ సమాఖ్యలోని లలితాంబికా సంఘ సభ్యులు ప్రభుత్వ రుణంతో జూట్‌బ్యాగ్‌ల తయారీ యూనిట్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు. దీనికి రూ.లక్ష రుణం మెప్మా ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా ఆదివారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి వచ్చిన జిల్లా మెప్మా పీడీ కిరణ్‌కుమార్, కమిషనర్ నాగేంద్రకుమార్ ఈ యూనిట్‌ను పరిశీలించారు. పనితీరు, ఇతర జ్యూట్ మార్కెటింగ్ విషయాలపై ఆరా తీసి ప్రభుత్వం మహిళలకు అండగా ఉంటుందని, ఉచిత శిక్షణలు సైతం అందిస్తోందని అన్నారు. ఆయనతో పాటు ఐబీ రవికుమార్, ఎల్‌హెచ్ బోర భాస్కరరావు, బ్యాంకు లింకేజి అధికారి వెంకటరావు, సీఎంఎం పిన్నింటి మోహనరెడ్డి, సీఓ స్వప్నకుమారి, డీఈఓ బోర విజయకుమార్‌రెడ్డి, ఆర్పీ పుణ్యావతి, టిఎల్ఎఫ్ అధ్యక్షురాలు, కె.ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల మల్లన్నకి తలపాగా



మల్లన్నకు ఇచ్చే తలపాగా నేతను సిద్ధం చేసిన దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఫాజుల్ బాగ్ పేటలోని దేవాంగుల వీధిలో శ్రీశైల మల్లికార్జునస్వామికి 365 మూరల తలపాగా ఇవ్వాలని ఆదివారం పనులకు శ్రీకారం చుట్టారు. తూతిక వెంకటరావు నిర్వహణలో తలపాగాను శివరాత్రి రోజుకు అందించడానికి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గత కొన్నేళ్లుగా సంప్రదాయంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

30న విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఈ నెల 30న ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై భారత ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలోని ఎంఎస్ఎంఈ-డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్, విశాఖ, జిల్లా పరిశ్రమలశాఖ(డిఐసి), డీఆర్‌డీఏ, డీపీఓ శ్రీకాకుళం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. సంబంధిత కులవృత్తిదారులు పాల్గొని ఈ పథకం ద్వారా వచ్చే లబ్ధిని పొందాలని, మరిన్ని వివరాల కోసం డీవీఎస్ఆర్ మూర్తి, అసిస్టెంటు డైరెక్టర్ వారి ఫోన్ నంబరు 9492689462ను సంప్రదించాలని సంబంధిత వర్గాలు తెలిపాయి.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కాశీబుగ్గ: పూండి-పలాస రైల్వే స్టేషన్ మధ్య ఆదివారం ఉదయం సమయంలో రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారిపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. అతని వయస్సు 25 నుంచి 30 మధ్య ఉంటుంది. అతని వివరా లు తెలియరాలేదు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్ఐ షేక్ షరీఫ్ తెలిపారు.

తీరిన వెతలు.. | మారిన బతుకులు



- ఫిష్ ఆంధ్రా'తో ఉపాధి
- ఆదర్శంగా నిలుస్తున్న తోటమ్మ కుటుంబం
- ఒకవైపు చేపల విక్రయం
- మరో వైపు రూ.70లకే చేపతో భోజనం

శ్రీకాకుళం: ఒకప్పుడు రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై ఉన్న ఆమె వ్యాపారం.. నేడు చక్కటి షాపులోకి చేరింది. సముద్రంలోకి వేటకు వెళ్లి కష్టపడిన ఆమె భర్త.. నేడు ఇతర ప్రాంతాల నుంచి చేపలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. చదువుల కోసం ఇబ్బంది పడిన కుమార్తెలు.. సగర్వంగా నేడు కాలేజీకి వెళ్తున్నారు. వైఎస్సార్ సీపీ వినూత్న విధానాలతో తీరిన వెతలకు, మారిన బతుకులకు బర్రి తోటమ్మ కుటుంబం ఓ నిదర్శనం. ఫిష్ ఆంధ్రా మొదలుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ వరకు సంక్షేమ పథకాలను వినియోగించుకుని చక్కటి బతుకు బాటను ఏర్పరచుకున్నారు.

తోటమ్మది శ్రీకాకుళం రూరల్ మండలం చినగనగళ్లపేట గ్రామం. ఈమె భర్త రామారావు సముద్రంలో చేపల వేటకు వెళ్లి వచ్చినప్పుడు సంపాదించిన మొత్తంతో కుటుంబమంతా జీవనం సాగించేది. కొన్నేళ్ల కిందట వీరు కుమార్తెల చదువుల కోసం శ్రీకాకుళం పట్టణానికి కుటుంబంతో పాటు వచ్చేశారు. మండల వీధిలో నివాసం ఉంటూ జీవనోపాధికి అరసవల్లి కూడలి వద్ద రోడ్డు పక్కన చేపలు విక్రయించేవారు. కుమార్తెలను చదివిస్తూ కుటుంబాన్ని పోషించటం కష్టంగా ఉండేది. సరిగ్గా అదే సమయంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత సీఎం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఈ కుటుంబం సమర్థంగా వినియోగించుకుంది. పిల్లలకు జగనన్న ఇస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తోంది. భర్తకు ఏటా వేట విరామ సమయంలో భృతి అందడం మొదలైంది. వీటన్నింటికంటే 'ఫిష్ ఆంధ్రా' అవకాశాన్ని తోటమ్మ ఒడిసిపట్టుకున్న తీరు అందరికీ ఆదర్శప్రాయం.



ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్‌లో తోటమ్మ కుటుంబం

వినూత్నంగా విస్తరణ

మత్స్యకారుల కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన ఫిష్ ఆంధ్రా పథకం ఆ కుటుంబానికి వరంగా మారింది. అరసవల్లి కూడలి వద్ద మూడు నెలల కిందట ఫిష్ ఆంధ్రా షాపును నెలకొల్పి తాజా చేపల విక్రయాన్ని ప్రారంభించారు. రూ.2.2లక్షల బ్యాంకు రుణంతో షాపును ఏర్పాటు చేసుకున్నారు. దీనికి 40శాతం రాయితీని ప్రభుత్వం కల్పించింది. వ్యాపారం రెట్టింపు కావటంతో వినూత్న తరహాలో విస్తరించారు. వారానికి అరటన్నుకు పైగా చేపలను విక్రయిస్తున్నారు.

రూ.70లకు చేపతో భోజనం

తోటమ్మకు కొత్త తరహా ఆలోచన రావటంతో రూ.70 లకే పూర్తి స్థాయిలో చేపల పులుసుతో పాటు చేప ముక్కతో భోజనం వడ్డించడం మొదలు పెట్టారు. వినియోగదారుల కోరిక మేరకు రొయ్యల కూర వండి సరఫరా చేస్తున్నారు. దీనికి కూడా ఆదరణ లభించడంతో సాయంత్రం సమయంలో ఫిష్, రొయ్యల వేపుడు విక్రయిస్తున్నారు. ఆర్డర్ ఇచ్చినప్పుడు ఫిష్, రొయ్యల బిరియానీ తయారు చేసి రూ.100 నుంచి రూ.150లకు విక్రయిస్తున్నారు. పెద్ద మొత్తంలో ఆర్డర్ ఇస్తే ఇంటి వద్దకే సరఫరా చేస్తుండటంతో ఆదరణ పెరుగుతోంది.

సాఫీగా చదువులు

తోటమ్మ కుమార్తెలు విజయలక్ష్మి, సుగుణలు వ్యాపారంలో తల్లికి సహకరిస్తూనే చదువుల్లో రాణిస్తున్నారు. భర్త రామారావు షాపులో విక్రయించేందుకు జిల్లాలోని పలువురు మత్స్య కారుల నుంచి చేపలను కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు.

మరికొందరికి ఉపాధి

ఫిష్ ఆంధ్రా చేపల వ్యాపారం చేస్తూ తోటమ్మ కుటుంబం ఉపాధి పొందుతూనే మరికొందరికి ఉపాధిని కల్పిస్తున్నారు. షాపులో వంట చేసేందుకు, వినియోగదారులకు భోజనం సరఫరా చేసేందుకు, చేపలను కట్‌చేసి, శుభ్రం చేసేందుకు కొందరిని నియమించి వారికి కూడా ఉపాధిని కల్పిస్తున్నారు. వీరి వ్యాపారం ఇప్పుడు ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. జగనన్న తమ కుటుంబాన్ని సంక్షేమ పథకాలతో ఆదుకున్నారని తోటమ్మ తెలిపారు.

ఒక్క రోజులో రూ.3.15 లక్షల ఆదాయం



ఆదిత్యుని జ్ఞాపికను డీఆర్‌ఓ నాగేశ్వరరావుకు అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఒక్క రోజులో వివిధ దర్శనాల టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,15 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌వీ నాగేశ్వరరావు కుటుంబసమేతంగా ఆదివారం ఉదయం స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సాంప్రదాయ ప్రకారం ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను ఆయనకు వివరించారు.

కొత్త కలెక్టర్‌గా మనజిర్ జిలాని సమూన్

- నంధ్యాల నుంచి ఇక్కడకు బదిలీ
- ప్రస్తుత కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా బదిలీ
- శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా తమీమ్ అన్సారియా నియామకం
- కొత్త కలెక్టర్, కమిషనర్‌లిద్దరూ భార్యాభర్తలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లా కలెక్టర్‌గా మనజిర్ జిలాని సమూన్ నియమితులయ్యారు. నంధ్యాల కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు రానున్నారు. ప్రస్తుత కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్‌గా బదిలీ అయింది. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పనిచేసిన ఎ.తమీమ్ అన్సారియా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న ఓబులేసుకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదు. కొత్త కలెక్టర్, కొత్త కమిషనర్‌గా నియమితులైన ఇద్దరూ భార్యాభర్తలు కావడం గమనార్హం.

జిల్లాపై శ్రీకేష్ బి.లాఠకర్ ముద్ర

మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కమిషనర్ అండ్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న ప్రస్తుత కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ రెండున్నరేళ్లకు పైగా జిల్లాలో పనిచేశారు. 2021 జూన్ 4వ తేదీన ఇక్కడ నియమితులవ్వగా, అదే నెల 8వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. 2011 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీకేష్ బి.లాఠకర్ జిల్లాలో తనదైన ముద్ర వేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంలోనూ, జిల్లాలో చేపట్టిన కీలక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. ముఖ్యంగా కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి నిర్మాణం, ఉద్దానం రక్షిత మంచినీటి ప్రాజెక్టు, మూలపేట పోర్టు విషయంలో ప్రత్యేక చొరవ చూపారు. భూ సమగ్ర సర్వే, ఉపాధి హామీ పథకం అమల్లో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేశారు. నాడు-నేడు, గ్రామస్థాయి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణం, సచివాలయాలకు సోలార్ వెలుగులు, ఉద్దానం కిడ్నీ బాధితులకు డయాలసిస్ సేవలు తదితర వాటిలో సమర్థంగా, సమయస్ఫూర్తితో వ్యవహరించారు. సిక్కోలు జిల్లా రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందేలా తనదైన పాత్ర పోషించారు.

కలెక్టర్, కమిషనర్‌లుగా భార్యాభర్తలు

కొత్త కలెక్టర్‌గా నియమితులైన మనజిర్ జిలాని సమూన్ స్వస్థలం జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్. 2012 నాగాలాండ్ కేడర్‌కు చెందిన ఈయన గతంలో విశాఖ మెట్రోపాలిటన్ రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ అడిషనల్ కమిషనర్‌గా, కర్నూలు జిల్లా గ్రామ సచివాలయాల జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. నంధ్యాల జిల్లాగా ఏర్పడ్డాక తొలి కలెక్టర్‌గా నియమితులయ్యారు. 2022 ఏప్రిల్ 4వ తేదీ నుంచి అక్కడే పనిచేస్తున్నారు. తాజాగా బదిలీల్లో ఇక్కడకు వస్తున్నారు. ఈయన భార్య తమీమ్ అన్సారియా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులయ్యారు. 2015 ఉత్తర ప్రదేశ్ కేడర్‌కు చెందిన అన్సారియా గతంలో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌గా, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం మున్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పనిచేస్తూ సెలవులో ఉంటూ రిపోర్టు చేయడంతో తాజాగా కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. వేరే రాష్ట్రాలకు కేడర్‌కు చెందిన వారైనప్పటికీ స్పౌజ్ కోటాలో మన రాష్ట్రానికి వచ్చారు. కొత్తగా నియమితులైన కలెక్టర్, కమిషనర్లకు ఎన్నికలు తొలి టాస్క్ కానున్నాయి.

జీవితంలో ఊహించని గౌరవమిది

- నందిగాం సర్పంచ్ జడ్యాడ రమణమ్మ
- ఢిల్లీలోని గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్

నందిగాం: భారత 75వ గణతంత్ర వేడుకల్లో నందిగాం పంచాయతీ సర్పంచ్ జడ్యాడ రమణమ్మకు అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్రంలో 13 మంది సర్పంచ్‌లకు ఈ వేడుకలకు ఆహ్వానం రాగా.. అందులో రమణమ్మ కూడా ఉన్నారు. ఈ 13 మందిలో రమణమ్మకు మరింత ప్రత్యేకంగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్, సహాయమంత్రి కపిల్ మేరేశ్వర్ పాటిల్ దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపికలు బహుకరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఏపీ పంచాయతీ రాజ్ సెక్రెటరీ వి.పద్మకేసిన్, నోడల్ అధికారి బి.మూర్తి, నందిగాం జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ జడ్యాడ జయరాం పాల్గొన్నారు. ఇది తాను జీవితంలో ఊహించని గౌరవమని ఆమె ఫోన్‌లో 'సాక్షి'కి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడారు.

మారుమూల పల్లెలో ఉన్న తమలాంటి వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్పంచ్‌గా అవకాశం కల్పించడంతో ఈ స్థాయి గౌరవం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి, ప్రధాన మంత్రులు టీవీల్లోనే చేసే తనకు ప్రత్యక్షంగా చూసే అవకాశం రావడం, వారితో కలిసి గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. గతంలోనూ పంచాయతీ రాజ్ కమిషనర్ సూర్యకుమారి చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నానని గుర్తు చేసుకున్నారు. స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాల విభాగంలో ఉత్తమ పంచాయతీగా అవార్డు సాధించామని చెప్పారు. తన పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా సుమారు రూ.4లక్షలు ఆదాయం వచ్చేలా పంచాయతీ యంత్రాంగం పనిచేసిందని, ఇంటి పన్ను ద్వారా కూడా ఆదాయం సాధించామని, పంచాయతీలో మంచినీటి కల్పనతో పాటు ఇంటింటికీ మంచినీరు అందించే కార్యక్రమం చేపట్టామని, వీటి వల్లనే అవార్డు సాధ్యమైందని తెలిపారు. తనకు దక్కిన ఈ గౌరవం పంచాయతీకి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని, దీనికి కారణమైన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. దళిత మహిళగా తనకు ఈ స్థాయి గౌరవం దక్కేలా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు.



కేంద్ర మంత్రుల నుంచి జ్ఞాపిక అందుకుంటున్న నందిగాం సర్పంచ్ జడ్యాడ రమణమ్మ

'ఐక్యతతోనే జాతి అభివృద్ధి'

సోంపేట: ఐక్యతతోనే జాతి అభివృద్ధి చెందుతుందని తద్వారా రాజ్యాధికారం సాధించుకోవచ్చునని జిల్లా అగ్నికులక్షత్రియ సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు గౌరకల వసంత స్వామి అధ్యక్షతన జిల్లా స్థాయి అగ్నికుల క్షత్రియ సంఘ ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనాన్ని బారువలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బర్రి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు వసంత్, ప్రధాన కార్యదర్శి పులకలశ్రీరాములు, సంఘ గౌరవ అధ్యక్షులు రెయ్యి కోదండ కృష్ణ తదితరులు మాట్లాడుతూ రాజ్యాధికారంతోనే జాతి అభివృద్ధి చెందుతుందన్నారు. రాజకీయ, విద్యారంగాల్లో సంఘం సత్తాచాటాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంఘంలోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పీవీ రావు, ఏపీ కార్పొరేషన్ డైరెక్టర్లు తిరుమాని నాగరాజు, జుత్తు నీలకంఠం, ఒంగోలు జిల్లా అధ్యక్షుడు అవని గెడ్డ నాగయ్య, ఒడిశా అధ్యక్షుడు మర్ల నాగరాజు, అడిషనల్ కమిషనర్ జుత్తు తాతారావు, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు చిలకపూడి పాపారావు, జిల్లాలోని పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న అగ్నికుల క్షత్రియ సంఘ ప్రతినిధులు

పాతపాడులో విషాదం

కొత్తూరు: కొత్తూరు మండలం పాతపాడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పాతపాడు గ్రామానికి చెందిన ప్రకాశరావు, ఆదిలక్ష్మిల దంపతుల కుమారుడు కంఠ బాలకృష్ణ(21) రాజమండ్రి సమీపంలో ఆదివారం జరిగిన మోటార్ సైకిల్ ప్రమాదంలో మృతి చెందాడు. బాలకృష్ణ నెల్లూరు జిల్లాలోని రొయ్యలు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అతను ఈ నెల 27వ తేదీన ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై నెల్లూరు బయల్దేరాడు. రాత్రి విశాఖలో ఉన్న బాలకృష్ణ ఆదివారం ఉదయం బైక్ మీద బయల్దేరాడు. రాజమండ్రి దాటిన తర్వాత సామర్ల కోట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు చెప్పారు. అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యులంతా అక్కడకు తరలివెళ్లారు.

ఉల్లాసంగా జిల్లా స్థాయి రగ్బీ ఎంపికలు

టెక్కలి: జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్-14 బాల బాలికల జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఒక్కో టీమ్ నుంచి 24 మందిని ఎంపిక చేశారు. వచ్చే నెల 3 నుంచి రెండు రోజుల పాటు విశాఖపట్టణంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా కోశాధికారి డి.రామకృష్ణ వెల్లడించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ప్రయాణ ఖర్చులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కార్యదర్శి బి.నారాయణరావు, ప్రతినిధులు కేకే రామిరెడ్డి, కె.రఘునాథరావు, ఎన్.జగదీష్, డి.నాగరాజు, శైలజ, ఎస్.రమేష్, సీతయ్య, పూర్ణచంద్రరావు, నర్మద తదితరులు పాల్గొన్నారు.



టెక్కలిలో నిర్వహించిన జిల్లా స్థాయి రగ్బీ జట్ల ఎంపికల్లో క్రీడాకారులు

చిన్నారులకు ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామానికి చెందిన 4, 2 తరగతులు చదువుతున్న చిన్నారులు శరణ్య, లిఖితలకు సాయం అందుతోంది. ఇటీవల సాక్షి దినపత్రికలో 'అమ్మ లేదు..నాన్న రాడు' అనే శీర్షికన కథనం ప్రచురించడంతో పలువురు దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గ కేంద్రంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న 'డాక్టర్ అబ్దుల్ కలాం సేవా ఫౌండేషన్' సభ్యులు స్పందించారు. ఆదివారం తేలుకుంచి వెళ్లి చిన్నారులకు రూ.17వేలు నగదుతో పాటు సుమారు రూ.నాలుగు వేల విలువైన నిత్యావసర సరుకులు, నూతన దుస్తులు అందజేశారు.



శరణ్య, లిఖితలకు నగదు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఏపీ స్టేట్ పెన్షనర్స్ ధర్నాకు ఏపీటీఎఫ్ మద్దతు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నిర్వహించతలపెట్టిన ధర్నాకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు ఐఎఫ్‌యా జాతీయ కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి టెంక చలపతిరావు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఏపీ ఎన్‌జీఓ హోంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. వాన కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సన్నశెట్టి రాజశేఖర్, టెంక చలపతిరావు, రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ సమస్యలు ఏకరువు పెట్టారు. పెన్షనర్లు చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను, అన్ని బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు బి.రవి, బి.వెంకటేశ్వర్లు, ఆర్‌వీ అనంతాచార్యులు, బి.నవీన్, వైవీ రమణ, మండల కమిటీ నాయకులు బి.కృష్ణారావు, బి.శ్రీనివాసరావు, పి .ఆనందరావు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్

ప్రయోగాలకు సంసిద్ధత

- ఫిబ్రవరి 11 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- నేటి నుంచి పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలించాలని అధికారుల నిర్ణయం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షల ఏర్పాట్లకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఇంటర్మీడియెట్ బోర్డు పబ్లిక్ పరీక్షలతోపాటు ప్రాక్టికల్స్ పరీక్షల షెడ్యూల్ ను సైతం వెలువరించిన విషయం తెలిసిందే. ఈ షెడ్యూల్ ప్రకారం మార్చి 1 నుంచి థియరీ పబ్లిక్ పరీక్షలు జరుగుతుండగా.. సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 11 నుంచి మొదలై 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రెండు విడతల్లో జరిగే ఈ ప్రాక్టికల్స్‌కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి పరీక్ష కేంద్రాల పరిశీలన..

పాత విధానంలో అనగా నాన్‌జంబ్లింగ్ విధానంలో జరిగే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు అధికారులు సమాయత్తమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, ఇంటర్‌బోర్డు సెక్రటరీ సౌరబ్‌గౌర్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచనల మేరకు అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇందుకోసం తొలుత పరీక్ష కేంద్రాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఈనెల 29వ తేదీ నుంచి పరీక్ష కేంద్రాల్లో వసతులు, మౌలిక సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ప్రాక్టికల్స్ పరికరాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించి నివేదికలను ఇంటర్‌బోర్డుకు చేరవేయనున్నారు. జిల్లా డీవీఈఓ కోట ప్రకాశరావు సారథ్యంలో జిల్లా ఆర్‌ఐఓ పి.దుర్గారావు, సీనియర్స్ ప్రిన్సిపాల్స్, సబ్జెక్టు నిపుణులతో కూడిన హైపవర్ కమిటీలు జూనియర్ కళాశాలలను జల్లెడపట్టనున్నాయి. జిల్లాలో 130 వరకు ప్రాక్టికల్స్ కేంద్రాలు కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. గత ఏడాది 140 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ జరిగాయి.



ప్రాక్టికల్స్‌కు సిద్ధంగా ఉన్న కెమిస్ట్రీ ల్యాబ్



ప్రాక్టికల్స్ కోసం లెక్చరర్లకు తర్ఫీదును అందిస్తున్న ఫిజిక్స్ నిష్ణాతులు అన్నపూర్ణారావు

పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం..



జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇంటర్‌బోర్డు వెలువరించిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 11 నుంచి 20వ తేదీ వరకు సైన్స్ విద్యార్థులకు రెండు విడతల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. 29వ తేదీ నుంచి పరీక్ష కేంద్రాల్లో వసతులు, సదుపాయాలను తనిఖీలు చేస్తున్నాం. నివేదికలను ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులకు చేరవేస్తాం.

– ప్రగడ దుర్గారావు, జిల్లా ఆర్ఐఓ, ఇంటర్మీడియెట్ బోర్డు

బంగారం షాపులో చోరీకి విఫలయత్నం

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలోని కిల్లంశెట్టి జగదీశ్వరావుకి చెందిన బంగారం షాపులో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. శనివారం ఉదయం షాపు తాళాలు పగులగొట్టి ఉండటం గమనించిన షాపు యజమాని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాపు పరిసర ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల కనెక్షన్లు తప్పించిన దుండగులు షాపు తెరవడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. అయితే పోలీసులకు దొరికిన ఒక సీసీ పుటేజీలో ముగ్గురు యువకులను గుర్తించినట్లు సమాచారం. సీఐ నల్లి సాయి, ఎస్ఐ రాజేష్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. షాపులో ఉన్న బంగారం, వెండి ఏవీ కూడా దొంగతనానికి గురి కాలేదు.